క్లుప్తంగా

మానసాదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం పరిసరాల్లో ఉన్న శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తెల్లవారు జామున 4 గంటల నుంచి 5గంటల వరకు అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తలు పిన్నింటి రమణ, ఈశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనుల పరిశీలన



గెద్దపేటలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: మండలంలోని గెద్దపేట, బిల్లలవలస గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపడుతున్న గోకులం షెడ్ల నిర్మాణాలను ఎంపీడీఓ జి.గిరిబాల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.మండలానికి 75 గోకులం షెడ్లు మంజూరు కాగా 63 మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారని చెప్పారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ ఆర్.సన్యాసిరావు, తదితరులున్నారు.

బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల భోజనాలను పరిశీలిస్తున్న చిన్మయిదేవి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్త్రీ,శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు పి.చిన్మయిదేవి ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. నరవ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తనిఖీలు చేశారు. పిల్లల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. పిల్లల కోసం వండిన భోజనాన్ని రుచిచూశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, లబ్ధిదారుల కు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట సీడీపీఓ ఉమాభారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంటకాలను పరిశీలిస్తున్న పద్మలత

గంట్యాడ: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లాఫుడ్ విజిలెన్స్ మెంబర్ వి.పద్మలత అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశా లలో శుక్రవారం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అన్నం, సాంబారు, కూరను రుచి చూశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే సహించం



మద్యం దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు

గజపతినగరం: ప్రభుత్వ లైసెన్సు మద్యం దుకాణాల్లో అవకతవకలకు పాల్పడినా, అక్రమాలు, తప్పులు చేసినా సహించేది లేదని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి బి.శ్రీనాథుడు హెచ్చరించారు.గజపతినగరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని లైసెన్సు మద్యం దుకాణాల యజమానులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వైన్ షాపులను నడపాలన్నారు. నిర్ణీత సమయంలో మాత్రమే అమ్మకాలు చేయాలని సూచించారు. ఎక్సైజ్ సీఐ.జె.జనార్దనరావు, ఎస్‌ఐలు పి.నరేంద్ర కుమార్,ఎస్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో.. బాదుడే బాదుడు...



- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాటు
- లాంతర్లతో నిరసన తెలుపుతూ ర్యాలీ చేసిన పార్టీ శ్రేణులు
- హాజరైన జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



చీపురుపల్లిలో ర్యాలీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

చీపురుపల్లి: తాము అధికారంలోకి వస్తే అయిదేళ్లలో విద్యుత్ చార్జీలు అస్సలు పెంచబోమని ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచి పేదప్రజలపై తీవ్ర భారాన్ని మోపారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలో శుక్రవారం 'పోరుబాట' కార్యక్రమం నిర్వహించారు.మెయిన్‌రోడ్‌లో ఉన్న దివంగత ముఖ్య మంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు,వైఎస్సార్‌సీపీ శ్రేణులు,ప్రజలతో కలిసి మూడురోడ్ల జంక్షన్,విజయనగరం–పాలకొండరోడ్, ఆంజనేయపురం తదితర ప్రాంతాల మీదుగా ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు దఫా లుగా రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీలను పెంచిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌తో పాటు అనేక బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఆరునెలల్లోనే ఈ ప్రభుత్వం ప్రజల ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేసిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసా దక్కేదని, కళకళ లాడేదన్నారు. తాజాగా కురిసిన వర్షాల కారణంగా జిల్లాలో పంటలు నాశనమైతే రైతులను పట్టించుకునే తీరిక అధికార పార్టీ నేతలకు లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా పథకం అమలైంద ని, రైతులు ప్రీమియం చెల్లించకుండానే పంటలకు బీమా వర్తించేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని నిబంధన విధించడంతో అన్యాయం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందిందని, చంద్రబాబు ప్రభుత్వం ఆపథకాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు వేలల్లో బిల్లులు ఇస్తూ కట్టకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణ రాజు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, గరివిడి,గుర్ల జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, నాయకులు పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీని వాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, గుడివాడ శ్రీరాములు, కొణిశ కృష్ణంనాయుడు, లెంక శ్రీరాములు, యడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ, బమ్మిడి కార్తీక్, పొన్నాడ కుమార్, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, స్వామినా యుడు, తోట తిరుపతిరావు, బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.

మోసం, వంచన చంద్రబాబు నైజం



గజపతినగరంలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు

- వైఎస్సార్‌సీపీ పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ప్రజలను మోసం చేయడం, వంచించడం చంద్రబాబు నైజమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపు ను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలో శుక్ర వారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించింది. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నిరసన ర్యాలీ చేశారు. అనంతరం ఏడీ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా అప్పలనరసయ్య మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజల కు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడవకముందే ప్రజల నడ్డివిరిగేలా చార్జీల బాదుడు మొదలు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల వాగ్దానాలు, హామీలను చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు. ఈప్రభుత్వానికి డైవర్షన్ పాలిటిక్స్ చేయడం తప్ప మరోపని చేతకావడం లే దని ఎద్దేవా చేశారు. ఆరునెలలు కాకుండానే రూ.85వేల కోట్లు అప్పు చేశారని, ఆడబ్బుతో ఏ పథకాలు అమలు చేశారు, ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, జా మి మండలాల ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక, సింహాద్రి అప్పలనాయుడు, చల్లా చల్లంనాయుడు,సబ్బవరపు అరుణ, గజపతినగరం, దత్తిరా జేరు, బొండపల్లి, గంట్యాడ జెడ్పీటీసీలు గార తవుడు ,రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాష్, వర్రి నరసింహమూర్తి, వైస్ ఎంపీపీలు కర్రి శ్రీదేవి,మిత్తిరెడ్డి రమేష్, బమ్మిడి అప్పలనాయుడు, గజపతినగరం,బొండపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూడి వెంకట రావు, బొద్దల చిన్నంనాయుడు, నాయకులు ప్రభూజీ రాజు, గొర్లె రవికుమార్, కరణం ఆదినారాయణ,బెల్లాన త్రినాథరావు,కడుబండి రమేష్‌నాయుడు,రెడ్డి పద్మావతి పాల్గొన్నారు.

ప్రజలను దోచేస్తున్న ప్రభుత్వం ఇది

- వైఎస్సార్‌సీపీ పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



ఎస్.కోటలో నిరసన ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నేతలు



విద్యుత్‌శాఖ ఏఈఈకి వినతిపత్రం అందజేస్తున్న కడుబండి, తదితరులు

శృంగవరపుకోట: ఎన్నికల వేళలో ఇచ్చిన హామీలు గాలికి పోయాయి. సంపద సృష్టి అంటే ప్రజలను దోచేయడమేనా అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం కదంతొక్కాయి. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో పోరుబాట పేరుతో స్థానిక దేవి జంక్షన్ నుంచి రామనగర్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం ఏఈఈ రుద్ర రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలుంటే తగ్గిస్తామని, ఆదాయం పెంచుతా, సంపద సృష్టిస్తా, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తా అని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా ప్రజలను దోచుకుంటున్నారని, ఆరునెలలు గడవక ముందే విద్యుత్ చార్జీల పెంపు ద్వారా రూ. 15వేల కోట్ల భారం ప్రజలపై మోపారని మండిపడ్డారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎస్.కోట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ ఫోక్ అకాడమీ మాజీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ,ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఏడువాక సత్యనారాయణ, కొత్తవలస ఎంపీపీ ఎస్.గోపమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, జామి జెడ్పీటీసీ గొర్లె సరయు, వేపాడ మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరి జగన్నాథం, ఎంపీటీసీలు పదాల ధర్మారావు, కడారి అప్పయ్య, గేదెల శాంత, బి.స్వామినాయుడు, కోళ్లకృష్ణ, చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, నాయకులు పల్లా భీష్మ, ఐతంశెట్టి శ్రీను, వై.మాధవరావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు , రుద్ర వెంకటరావు, బీల సతీష్, బోజంకి రామునాయుడు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం కోరుతూ కార్మికుల నిరవధిక సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరునాయుడు

చీపురుపల్లి: వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కర్లాం వద్ద ఉన్న శ్రీ వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ ప్రధాన గేటు ఎదుట శుక్రవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరునాయుడు మాట్లాడుతూ 2024 జూన్ నెలలో వేతన ఒప్పందం అమలు చేయాల్సిన పరిశ్రమ యాజమాన్యం ఇంతవరకు ఆ ఊసే ఎత్తలేదన్నారు. కార్మికులు రూ.2వేలు పెంపు అడుగుతుండగా యాజమాన్యం కేవలం రూ.300 మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చిందన్నారు. ఇదే విషయమై గతంలో కార్మికశాఖ అధికారుల వద్ద పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగినట్లు చెప్పారు.వేతన ఒప్పందం అమలు చేసేంత వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం)నిర్వాహకులు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద సీపీఎం నేతృత్వంలో శుక్రవారం ధర్నా చేశారు.ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లా డుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బకాయిల బిల్లులు చెల్లించాలని, గౌరవ వేతనాలు ఇవ్వాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎంఈఓలు నర్సింగరావు, బి.జి.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శాసన మండలి విపక్షనేత బొత్స, మాజీ ఎంపీ బెల్లాన

చీపురుపల్లి: ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయ కుడు, మాజీ మంత్రి, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తండ్రి,ఎంపీపీ వెంకటనరసమ్మ మామయ్య సత్యం బుధవారం మృతిచెందారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీపీ కుటుంబాన్ని బొత్స పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, స్థానిక నాయకులు బెల్లాన త్రినాథ, కంది పాపినాయుడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ బడిని రక్షించడమే ధ్యేయం



ఎస్.కోట ఎమ్మార్సీ వద్ద ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

శృంగవరపుకోట: ప్రభుత్వ బడిని రక్షించుకోవడమే ధ్యేయంగా కాకినాడలో 2025 జనవరి 5 నుంచి 8 తేదీ వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. స్థానిక ఎమ్మార్సీలో స్వర్ణోత్సవ సభల ప్రచార పత్రికలను శుక్రవారం విడుదల చేశారు.మహాసభల్లో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మో హ న్ రావు, వి.శ్రీలక్ష్మి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జె.ఏ.వి.ఆర్. కె. ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము,తిరుపతినాయుడు, జి.వి.రమణ, జి.వెంకటరావు, పి.శ్రీనివాసరావు,వి.ఎస్.దేముడు, ఎం.వి.ఏ.ఎస్. నారాయణ, ఏ.శ్రీనివాస్, ఏ.రాము, కొండలరావు, వి.రమణ, అర్జున్, సత్యారావు, ఆర్.శ్రీను, కె.కృష్ణ, జి.గణేష్‌నాయుడు, కె.శ్రీనివాసరావు, పి.ఎస్.మూర్తి, టి.చిన్నంనాయుడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం: మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సై జ్ ,ప్రొహిబిషన్ సీఐ జె.జనార్దనరావు తెలిపారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ అంబేడ్కర్

శృంగవరపుకోట: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని కలెక్ట ర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సూచించారు. ధాంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన కలెక్టర్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించా రు. గ్రామంలో నెల రోజులుగా తాగునీటి బోరు పని చేయడం లేదని, విద్యుత్‌దీపాలు పనిచేయడం లేదని, స్తంభం మార్చాలని గ్రామస్తులు కోరారు. దీతో కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, అనంతరం గ్రామంలో పర్యటించి సాయంత్రానికల్లా సమస్యలు పరిష్కరించాలని డీపీఓను ఆదేశించారు .ఆర్డీఓ డి.కీర్తి, తహసీల్దార్ అరుణకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

30వ తేదీన వైజ్ఞానిక ప్రదర్శన

మెరకముడిదాం: సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్ వారి ఆదేశాలతో ఈనెల 30వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1,2లు చంద్రశేఖర్, ధర్మశ్రీను శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ సైన్స్ ప్రదర్శనలో పాల్గొనాలనికోరారు. ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

మన్మోహన్‌కు నివాళులు



శృంగవరపుకోట: మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ నాయకులు



గజపతినగరం: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట/గజపతినగరం: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఎస్.కోట, గజపతినగరం మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు,ఎస్.కోట కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఎస్.కోట దేవీ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గజపతినగరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని అన్నారు.ఎస్.కోట దేవీ జంక్షన్‌లో కాంగ్రెస్ నేతలు పదాల మణిబాబు, హెచ్.నానాజీ తదితరులు మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్తంగా ..

జనవరి 5న హైందవ శంఖారావం

వేపాడ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగసభను విజయవంతం చేయాలని హైందవ శంఖారావం కన్వీనర్ బీశెట్టి వెంకటేశ్వరరావు కోరారు. వేపాడ,వల్లంపూడి గ్రామాల్లో శుక్రవారం ఇంటింట ప్రచారం చేశారు. దేవాలయాల్లో అన్యమత ఉద్యోగు లను తొలగించాలని, దేవాలయ ట్రస్టుబోర్డుల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూడాలని, దేవాలయ పరిసరాల్లో దుకాణాలు హిందువులకే కేటాయించాల న్న డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైందవ శంఖారావం కో–కన్వీనర్ కె.అప్పారావు, చింతల నరసింగరావు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



గుర్ల: పెనుబర్తిలో వర్షానికి దెబ్బతిన్న పెసర పంటను పరిశీలిస్తున్న జేడీ వి.టి.రామారావు

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి)/: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు రైతులకు సూచించారు. చీపురుపల్లి, గరివి డి, గుర్ల మండలాల్లోని రావివలస, కోడూరు, పెనుబర్తి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంట లను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటకు యూరియా,డీఏపీ వేయాలని రైతుల కు సూచించారు. మొక్కజొన్న, మినప, పెసర పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా చేయించుకోవచ్చన్నారు. బ్యాంకుల్లో పంట రుణా లు తీసుకున్న రైతులు మినహాయించి మిగిలిన రైతులు ఈనెల 31వ తేదీలోగా ప్రీమియం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట ఏడీఏ ఎస్. కోటేశ్వరరావు, ఆయా మండలాల ఏఈలు ఉన్నారు.

లోగిశలో వైద్య శిబిరం

గజపతినగరం: మండలంలోని లోగిశలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో శుక్రవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 47మందికి వైద్యాధికారి, వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

నలుగురిపై బైండోవర్ కేసులు

బొండపల్లి: గతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడి కేసులు నమోదైన మండలంలోని నలుగురు వ్యక్తుల పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న నలుగు రిని గజపతినగరం ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ పి.నరేంద్రకుమార్ తహసీల్దార్ వద్ద శుక్రవారం హాజరు పరిచారు. నలుగురికి రూ.లక్ష పూచీకత్తుతో బాండ్లు తీసుకుని, ఇక నుంచి అక్రమంగా మద్యం విక్రయాలు చేయబోమని హామీ పత్రాలను తీసుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

మెరకముడిదాం: ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని హెచ్‌ఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గాదెలమర్రివలస, గరుగుబిల్లి, సాతాంవలస, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగును పరి శీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో 57 మొక్కలు వేయాలని, రైతులకు రాయితీపై మొక్కలు అంది స్తామని, అలాగే నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ.5వేలు చొప్పున అంతర పంటల సాగుకు సాయం అందిస్తామ న్నారు. ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



కాలువలోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసికెళ్లిన ఘటన శుక్రవారం చోటు చేసు కుంది.పోలీస్ స్టేషన్ సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించగా కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.